www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబర్ 2025
5
తిరుపతి

తెలంగాణ సిఎంకు ఘనస్వాగతం

■ తిరుపతి జిల్లాలో రెండురోజుల పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: 2 రోజుల తిరుపతి, తిరుమల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ, వాణిజ్య, ప్రణాళికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు ఘనస్వాగతం పలికారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకుని మంగళవారం తెల్లవారుజామున విఐపి బ్రేక్ దర్శనంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటారు. చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి శ్రీకాళహస్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు తదితరులు రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం

సర్వాంగ సుందరం.. శ్రీవారి ముఖ ద్వారం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎస్పీ సుబ్బారాయుడు, పనబాక లక్ష్మి

ప్రజాశక్తి - తిరుమల : తిరుమలలో సోమవారం అర్ధరాత్రి నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పైన ఒంటిగంటన్నరకు వైకుంఠ ద్వార దర్శనాలు మొదలయ్యాయి. ఈ దర్శనాలు జనవరి 8 వరకు కొనసాగుతాయి. మొదటి మూడు రోజులు ఈ-డిప్ టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. సుమారు 7 లక్షల 70 వేలమంది భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. మొత్తం 10రోజుల్లో 164 గంటల పాటు సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం లభించనుంది. 30, 31, జనవరి 1న రూ.300ల టికెట్ల దర్శనాలు, శ్రీవాణి దర్శనాలు, ఇతర ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసింది. జనవరి 6, 7, 8 తేదీల్లో స్థానికులకు లోకల్ కోటా కింద దర్శనం కల్పించనున్నారు. ప్రత్యేక ఆఫ్లైన్ కేటాయింపు ద్వారా రోజుకు 5వేల దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పించనున్నారు. ఆయా తేదీల్లో తిరుమలలో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని టిటిడి తెలిపింది.

స్వాగతం పలుకుతున్న సప్త ద్వారాలు

ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సప్తద్వారాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయం ముందు కళాకారుల నృత్యాల ప్రదర్శన చేయడానికి అనువుగా ప్రత్యేకమైన వేదికను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు అందరికీ ఆలయం లోపల, బయట జరిగే వేడుకలు కనిపించేందుకు అక్కడక్కడ ఎల్ఈడీ స్క్రీన్లను కూడా ఏర్పాటు చేశారు. ఆలయ ధ్వజస్తంభం ముందు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని కొలువుదీర్చనున్నారు.

భక్తుల భద్రత కట్టుదిట్టం

వైకుంఠ ఏకాదశి ఒక్క రోజు ముందుగానే పోలీసులు ఆలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. వేలాదిగా తరలివచ్చే ఆలయం వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, 60 మంది పోలీసు సిబ్బంది భద్రతా పరంగా విధులు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన ఘటన వల్ల తాజాగా భద్రతా చర్యల వెనుక అధికారులలో తెలియని కలవరం కనిపిస్తోంది. ఈసారి టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది 1800 మంది, 2000 మంది పోలీసులతో అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి ఆలయంలో యాత్రికులను వైకుంఠ ద్వార దర్శనాలకు ఆహ్వానం పలుకుతూనే ఆంక్షలు విధిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో వాహనాల తనిఖీకి చెక్ పోస్టులు సిద్ధం చేయడం, అలిపిరి వద్ద టోకెన్లు లేని వారిని వెనక్కి పంపించడం వంటి చర్యలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించడానికి యాత్రికులకు రూట్ మ్యాప్ విడుదల చేశారు. ముందుగా టీటీడీ అధికారులు 2018 లోనూ మాదిరే వైకుంఠ ద్వారాలు తెరవడం రెండు రోజులకే పరిమితం చేయాలని భావించారు. దీనిపై యాత్రికుల నుండి నిరసన, వ్యతిరేకత వస్తుందనే ఆలోచనతో తర్జనభర్జన పడ్డారు. అంతిమంగా యాత్రికుల మనోభావాలు కాపాడుతూనే, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేని విధంగా ప్రత్యేక కౌంటర్ల స్థానంలో సాంకేతిక ఆధారంగా ఆన్ లైన్ టోకెన్లు జారీ చేశారు.

అసాధారణ భద్రత వెనుక...

గతంలో తిరుమలలో వైకుంఠ ద్వారాలు రెండు రోజులు మాత్రమే తెరిచే వారు. 2018 నుంచి ఎక్కువ మంది యాత్రికులకు దర్శనాలు కల్పించాలని పది రోజుల పాటు ద్వారాలు తెరిచి ఉంచుతున్నారు. గతంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోవడం వెనుక కుట్ర కోణం ఉందనే దిశగా దర్యాప్తు జరుగుతోంది. ఆ ఘటన తరువాత ప్రస్తుత తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, టీటీడీ జేఈఓ, గౌతమి, టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్లను బదిలీ అయ్యారు. టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి, తిరుపతి క్రైం డీఎస్పీ రమణకుమార్లను సీఎం నారా చంద్రబాబు సస్పెండ్ చేశారు. తిరుపతి ఎస్పీగా తొమ్మిది నెలల తరువాత మళ్లీ ఎల్.సుబ్బారాయుడును సీఎం నియమించారు. ఈ పరిణామాలతో.. తిరుపతి, తిరుమల, టీటీడీ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఏర్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయనేది పోలీసు, టీటీడీ అధికారులు కలవరం చెందారు. దీంతో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఆ తరువాత తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సెక్యూరిటీ విభాగం సమన్వయంతో అసాధారణ భద్రతా చర్యలతో తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు.

ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఛైర్మన్

సోమవారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం శిలాతోరణం, కృష్ణతేజ విశ్రాంతి గృహాల వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.డి టోకెన్ల తనిఖీ కేంద్రంలో తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఈవో, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నరేష్, సీవీఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులున్నారు.

పిజిఆర్ఎస్‌కు 428 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ దేవేందర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుండి వచ్చే అర్జీదారులకు సకాలంలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివశంకర్ నాయక్, సుధారాణి, రోజ్ మాండ్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 270, పంచాయతీ రాజ్ 40, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 29, సెర్ప్ 19, పోలీస్ శాఖకు 20 అర్జీలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం వెరసి 428 అర్జీలు వచ్చాయని తెలిపారు.

రోడ్డు మార్గం కోసం ఆమరణ నిరాహార దీక్ష.....

కలెక్టరేట్ ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న యానాదుల గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కడపత్ర హరిజనవాడ సమీపంలోని పార్టీ మిట్ట గిరిజన కాలనీలో గడిచిన నాలుగు సంవత్సరాలుగా రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీలు ఇస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని యానాదుల గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జునరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు పెంచలయ్య ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టరేట్ ముందు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. స్పందించిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్సీ మధుసూదన్ ఫోన్ ద్వారా మల్లికార్జున రావుతో మాట్లాడి రూ.25 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరాహార దీక్ష విరమింప చేశారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించండి

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 27 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 15 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కమిషనర్‌ను కోరారు. లక్ష్మీపురం కూడలిని ప్రారంభించాలని, చెత్త వేయకుండా గేట్ ఏర్పాటు చేయాలని, సచివాలయం రోడ్డు అక్రమణలు తొలగించాలని కార్పొరేటర్ ఎస్.కె.బాబు ఫోన్ ద్వారా కోరారు. కాగా రవీంద్ర నగర్ రెండవ క్రాసులో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పూర్తి చేయాలని, సుబ్బారెడ్డి నగర్‌లో కాలువలు సరిగా లేక మురుగునీరు ఇండ్లలోకి వస్తున్నాయని, హౌసింగ్ బోర్డు కాలనిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, సంజీవనగర్‌లోని పెద్ద కాలువ వద్ద గ్రిల్స్ లేక ప్రమాదకరంగా ఉందని, స్కావెంజర్స్ కాలనీ వద్ద ఉన్న చికెన్ షాప్ వ్యర్థాలు కాలువలో వేయడం వలన ఇబ్బందిగా ఉందని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, తుడా అపార్ట్మెంట్ వద్ద అనదికారికంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు అపాలని, సంజయ్ గాంధీ కాలనిలో అనదికారికంగా నాలుగు అంతస్థుల భవనం నిర్మిస్తున్నారు చర్యలు తీసుకోవాలని, ప్రకాశం మునిసిపల్ పార్క్ పరిసరాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, సప్తగిరి నగర్ శివశక్తి కళ్యాణ మండపం వద్ద, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ లో భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేయాలని, రవీంద్ర నగర్ లో తెలుగుగంగ లైన్ వేశారు, కనెక్షన్ ఇవ్వలేదని, సుందరయ్య నగర్‌లో గుంతలు పూడ్చి రోడ్లు వేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్పిడిసిఎల్ సిఎండికి 50 వినతులు

డయల్ యువర్ ఏపీఎస్పీ డీసీఎల్ సిఎండి కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎపిఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "డయల్ యువర్ ఏపీఎస్పీ డీసీఎల్ సిఎండి" కార్యక్రమానికి 50 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, విద్యుత్ లైన్ మార్పు, లో-ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ తదితర సమస్యలు వీటిలో వున్నాయి. వినియోగదారుల సమస్యలపై సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ఆయా జిల్లా స్థాయిల్లో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ సంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

విద్యుత్ బిల్లుల వసూలుకు ప్రాధాన్యం

ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో మంగళవారం జరుగనున్న "కరెంటోళ్ళ జనబాట" కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పరిష్కారంతోపాటు విద్యుత్ బిల్లుల వసూళ్లకు కూడా సిబ్బంది ప్రాధాన్యత నివాలని ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. నెలాఖరు కారణంగా విద్యుత్తు బిల్లుల వసూళ్ల శాతం తగ్గకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(టెక్నికల్ అండ్ హెచ్ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్ఎసి) కె. రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. హెచ్. జానకి రామ్, జె. రమణా దేవి, కె. ఆదిశేషయ్య, యం.మురళీకుమార్, యం, ఉమాపతి, జనరల్ మేనేజర్లు కృష్ణా?రెడ్డి, రామచంద్ర రావు, చక్రపాణి, సురేంద్ర రావు, భాస్కర్ రెడ్డి. జగదీష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించినట్లు తహశీల్దార్ శైలకుమారి తెలిపారు. నాన్ అవైలబుల్ సర్టిఫికెట్‌కోసం ఒకటి, విద్యుత్ మీటర్‌కోసం ఒకటి వినతులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

రెవెన్యూ క్లినిక్ విజయవంతం

రేణిగుంట తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంటలో తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా విన్నపాల స్వీకరణ (గ్రీవెన్స్ డే) సందర్భంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతులు ఇచ్చేందుకు వచ్చే పౌరులతో ఎలా వ్యవహరించాలి, ప్రజల నుంచి తీసుకున్న ఫిర్యాదులను రెవెన్యూ డెస్క్‌లలో ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై సిబ్బందికి తహశీల్దారు అవగాహన కల్పించారు.

అడిషనల్ కమిషనర్‌గా శారదా దేవి

కమిషనర్ మౌర్యతో అడిషనల్ కమిషనర్ శారదా దేవి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శారదా దేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కమిషనర్ మౌర్యని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అడిషనల్ కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నగర అభివృద్ధి కోసం ప్రజల సహకారంతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తర్వాత పలువురు ఉన్నత అధికారులు అడిషనల్ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. అడిషనల్ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఇంజనీరింగ్ సూపర్డెంట్ శ్యాంసుందర్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్ రవికుమార్, డిసి మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను విజయవంతం చేయండి

నాయుడుపేటలో సిఐటియు నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి - నాయుడుపేట: ఈనెల 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగునున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ నుండి మార్కెట్ సెంటర్ వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి సిఐటియు కార్మిక చట్టాలు తెచ్చిందని గుర్తు చేశారు. నేడు వాటిని రద్దు చేసి, కార్మికులను బానిసలుగా మార్చనున్నారని ఆరోపించార. ఉపాధి హామీ పథకాన్ని కూడా రూపుమాపాలని యత్నిస్తున్నారని తెలిపారు. వీటన్నింటిపై మున్ముందు చేపట్టాల్సి కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభల్లో ప్రణాళిక చేయనున్నారని తెలిపారు. ఆటో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ రెడ్డి, సతీష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ కాలేషా, శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ఈ మహాసభలకు వేదిక కానున్నాయన్నారు. ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ పరిశ్రమల కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, మునరాజా, రామచంద్రయ్య,శ్రీధర్,పలువురు సిఐటియు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సిఐటియు నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే 18వ అఖిల భారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పిలుపునిచ్చారు. సిఐటియు అఖిల భారత మహాసభలకు సంఘీభావంగా సోమవారం పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోడీ మెడలు వంచేందుకు కార్మికులంతా ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గంధం మణి, కుమార్, వెంకటేష్, వేణు, సుబ్రమణ్యం, ప్రసాద్, గురునాధం, సీ.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **చలో విశాఖ గోడ పత్రికల ఆవిష్కరణ**

వరదయ్యపాలెంలో గోడ పత్రికలను అవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : విశాఖపట్నంలో 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే అఖిలభారత సిఐటియు 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వరదయ్యపాలెంలో సోమవారం చలో విశాఖ గోడపత్రికలను సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సిఐటియు సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్‌లు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలు చివరి రోజు అయిన జనవరి 4వ తేదీ ఆర్కే బీచ్‌లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర పూర్వం నుండి కార్మికుల సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని దానికి వ్యతిరేకంగా మహాసభల్లో పోరాట కార్యక్రమాల రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయలు, ఐఎఫ్టియు నాయకులు కృష్ణమూర్తి అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు శాంతి కెవిపిఎస్ మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పనబాక లక్ష్మీ, దివాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

■ టిడిపి తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా పనబాక లక్ష్మి

■ జిల్లా పార్టీ కార్యదర్శిగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎన్టీఆర్‌కు నాయకుల నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పనబాక లక్ష్మి, జిల్లా పార్టీ కార్యదర్శిగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ, టిటిడి బోర్డు సభ్యులు, డాక్టర్ పనబాక లక్ష్మీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్, టిటిడి ఎక్స్-ఆఫిషియో బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి హాజరై, నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పనబాక లక్ష్మీకి పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. పార్టీ క్రమశిక్షణ, ఐక్యత, ప్రజాసేవే తెలుగుదేశం పార్టీ బలం అని స్పష్టం చేస్తూ, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల మధ్యకు మరింత బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి టిడిపి నియోజకవర్గ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టిడిపి నగర అధ్యక్షులు చిన్న బాబు, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, టిడిపి నాయకులు భాస్కర్ యాదవ్, పుష్పావతి, బుల్లెట్ రమణ, బ్యాంక్ శాంతమ్మ, పాల్గొన్నారు.

పనబాక లక్ష్మికి శ్రీధర్ రెడ్డి శుభాకాంక్షలు

పనబాక లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్ రడ్డి

ప్రజాశక్తి -కోట : మాజీ కేంద్రమంత్రివర్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం టిటీడి బోర్డు సభ్యురాలు తిరుపతి పార్లమెంట్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగా నియమితులైన పనబాక లక్ష్మిని గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, కోట మండలం రైతు సంఘం అధ్యక్షులు మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వాకాడు మండలం టీడీపీ అధ్యక్షులు దువ్వూ రు మధు సూదన్ రెడ్డి, తిమ్మనాయుడు పాలెం మాజీ సర్పంచ్ మర్రి నాగభూషణం, తిరుమలశెట్టి రమణయ్యలు పార్టీ కార్యాలయంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పనబాక లక్ష్మిని టిడిపి అధిష్టానం తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా నియమించిన నేపథ్యంలో ఆమె మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు.

టిడిపి నాయకుల శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలుపుతున్న ఓజిలి మండల టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఓజిలి: తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సోమవారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఓజిలి మండల టీడీపీ నాయకులు విజయ్ నాయుడు, పాదర్తి ప్రకాష్ నాయుడు, పాడి వెంకట సుబ్బయ్య, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, పవిత్రా రెడ్డి కార్యకర్తలు ఆమెకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా స్థానిక బైరాగి పట్టెడలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ గర్ల్స్ కో కన్వీనర్ వెంకటలక్ష్మి స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించారు. గర్ల్స్ కో కన్వీనర్స్ మేఘన, స్రవంతిలు మాట్లాడుతూ 1970 డిసెంబర్ 30, 31 తేదీలలో త్రివేంద్రంలోని రెండు రోజులపాటు జరిగిన మహాసభలలో ఎస్ఎఫ్ఐ ఏర్పడి, నాటి నుంచి నేటి వరకు అధ్యయనం, పోరాటం అనే నినాదాలతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే ఆశయాలతో విద్యార్థుల కోసం అనేక పోరాటాలు చేస్తూ 55 సంవత్సరాలు పూర్తిచేసుకుని 56వ సంవత్సరంలోకి ఎస్ఎఫ్ఐ అడుగుపెడుతుందని వివరించారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడినప్పటి నుంచి నాటి నుంచి నేటి వరకు అనేకమంది ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమం కోసం అమరవీరులయ్యారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదారవాద, మతోన్మాద విధానాలతో విద్యలో అనేక మార్పులు తీసుకుని వస్తూ విద్యార్థులను విద్యార్థి ఉద్యమం, వారి హక్కుల కోసం పోరాటం చేయకుండా పక్కదారి పట్టిస్తూ కార్పొరేట్ చదువులు ఉద్యోగాల వైపు మళ్ళిస్తున్నారని తెలిపారు. వికసిత్ భారత్ శిక్షా అధిషా'న్ బిల్లు- 2025 బిల్లును తీసుకొని వచ్చి ఉన్నత విద్యను కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయికరణ చేస్తూ విశ్వవిద్యాలయాలను లోన్ ఏజెన్సీలుగా మారుస్తూ పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత విద్యకు దూరం చేస్తూ కార్పొరేట్ సోలాబాల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు శంకుస్థాపన చేస్తూ గ్రామీణ మండల లలో ఉన్న విద్యార్థులను ప్రైవేట్ విద్యను తప్పనిసరిగా అనుసరించాల్సి వచ్చే విధంగా చేస్తున్నాయి, మెడికల్ విద్యను ప్రైవేట్ వ్యాపార వస్తువుగా మారుస్తూ పిపిపి విధానాన్ని తీసుకొని వచ్చి మెడికల్ విద్యను ప్రైవేట్ పరం చేయడం జరిగిందని, ఇప్పటికైనా మెడికల్ కాలేజీల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుని నిర్వహించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, రెడ్డి కుమార్, తిప్పయాస్వామి, వినోద్, నవ్య, వనిత, సబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షర జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నాగలాపురం: పుట్టపర్తి, శ్రీ సత్య సాయి ఆర్గనైజేషన్ వారు సత్య సాయి జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తిరుపతి జిల్లా, నాగలాపురం మండలం, అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. వివిధ పోటీల్లో షాహీన, ప్రైషియలిన్, సహా, లావణ్య, యామిని, అనితలు విజేతలుగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వారిని చూసి మిగతా విద్యార్థులు స్ఫూర్తి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ హరి బాబు, అధ్యాపక బృందం ఢిల్లీ, జనని, లావణ్య, శీనన్, ప్రవంతి, నిర్మల, కార్తిక్, అరుణాచలం, భూమిక, వెన్నెల, అంబేద్కర్, కళ్యాణిలు పాల్గొన్నారు.

హిమజ డిగ్రీ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో యూనివర్సిటీ స్థాయిలో పుత్తూరు హిమజ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లోకానందం రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం రాజు విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయంలో అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం అభినందనీయమన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు: పి. పావని - B.Com - 9.55 CGPA, ఎ. సమీర- B.Sc (CS) -- 9.47 CGPA, పి. పూజ- B.Sc (CS) 9.44 CGPA, ఎస్. ఢిల్లీ ప్రసాద్- BCA (DS) - 9.20 CGPA, పి. మోనిషా- BCA (DS) -- 9.17 CGPA, ఎ. దేవి- BCA (DS)- 9.04 CGPA, ఎస్. లహరి - BCA (DS) - 9.01 CGPA, ఎస్. స్నేహలత- B.Com 9.01 CGPA, విద్యార్థులు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - నాయుడుపేట: పెళ్లకూరు మండలం, తాళ్వాయిపాడు పంచాయతీలో సోమవారం కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందిస్తున్న యూరియా బస్తాలను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంల ఆదేశాల మేరకు సోమవారం, నాయుడుపేట ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ యాదవ్, చిల్లకూరు పిఎసిఎస్ డైరెక్టర్ పెళ్ళకూరు గోపాలకృష్ణలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు అవసరమైన యూరియా బస్తాలను సకాలంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి సిబ్బంది రాహుల్, నాయకులు బాలయ్య, భాస్కర్, గంగాబత్తిన శ్రీనివాసులు, కన్నడి శ్రీనివాసులు, కర్పూరం వెంకటాచలపతి, వేంపల్లి వెంకటేశ్వర్లు, నెలవల ప్రసాద్, ముసునూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా సెవెన్ హిల్స్ హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సెవెన్ హిల్స్ హై స్కూల్ 37వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, బిజెపి లీగల్ సెల్ కొత్తపల్లి అజయ్ కుమార్, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, ఏపీ స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డీఈవో కుమార్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉత్తమ విద్యతో జీవితంలో అత్యుత్తమ స్థాయి సాధ్యమని, పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణతోనే సమాజానికి, దేశానికి సేవ చేయడం ద్వారానే తమ జీవితానికి సార్థకం చేకూరుతుందని తెలియజేశారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో విద్యనభ్యసించడం, ఈ ఆధ్యాత్మిక వాతావరణంలో పెరగడం కూడా ఒకరకంగా అదృష్టమని, ప్రతి ఒక్క విద్యార్థి గ్రహించాలని పేర్కొన్నారు. ఉన్నత విలువలు క్రమశిక్షణ ధ్యేయంగా సాగుతున్న ఈ 37 సంవత్సరాల విద్యా జీవితంలో, ఎంతో మంది ఉత్తమ విద్యార్థులను తయారుచేసిన సెవెన్ హిల్స్ హై స్కూల్ మధురానగర్ వారిని వక్తలు అభినందించారు. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాలలో పదవ తరగతిలో 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ కరెస్పాండెంట్ హరినాధ శర్మ, అడ్మినిస్ట్రేటివ్ హేమలత, సెవెన్ హిల్స్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య ఉష

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నూతన కులసచివులుగా ఆచార్య ఆర్. ఉష సోమవారం నిర్వహించిన పాలక మండలి సమావేశంలో విసి, ఈసి నిర్ణయం తీసుకున్నారు. మహిళా వర్సిటీలో విసి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ఇతర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ ఆధ్వర్యంలో మహిళావర్సిటీలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్సిటీకి చెందిన పలు అంశాల మీద చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

శానంబట్ల జల్లికట్టు వేదికపై వివాదం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, శానంబట్ల గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జల్లికట్టు నిర్వహించే వేదిక విషయమై వివాదం నెలకొనింది. గ్రామస్తులు ప్రస్తుత వేదికను ప్రమాదకరంగా భావిస్తూ ఇళ్లు, పాఠశాలకు దగ్గరగా ఉన్న కారణంగా భద్రతా సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. శానంబట్ల పెద్దలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి ప్రత్యామ్నాయ, సురక్షిత ప్రదేశంలో జల్లికట్టు నిర్వహణ కోసం విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

రెండో సెమిస్టర్‌లో ఆక్స్ ఫర్డ్ విద్యార్థుల ర్యాంకుల ప్రభంజనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్వీ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలలో ఆక్స్ ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. యూనివర్సిటీ స్థాయిలు అన్ని గ్రూపులలో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు. బీఎస్సీ (హానర్స్) కంప్యూటర్ సైన్స్ గ్రూపులో యం.లహరి (8.83), పి.శిరీష (8.73), ఎ.వైష్ణవి (8.70) పాయింట్లు, బీఎస్సీ (బయోటెక్నాలజీ హానర్స్) గ్రూపు నందు టి.సుజాత (8.85), ఎ.చంద్రిక (8.13), కె. సిరి (7.96) పాయింట్లు, బీకాం (హానర్స్) గ్రూప్ నందు యస్.కె. మస్రత్ (8.75) డి. పూర్ణిమ, (8.53) జ.సంతోష్, (8.51) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రాము గుప్తాకి ఘన సన్మానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ సభ్యుడిగా ఘన విజయం సాధించిన అరుణ మెడికల్స్ అధినేత రాము గుప్తాను సోమవారం శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ నుంచి రాము గుప్తా ఘనవిజయం సాధించడం శ్రీకాళహస్తికి గర్వకారణమని శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మను మధుసూదన్ రావు తెలిపారు. ఫార్మసిస్ట్, కెమిస్ట్ ల పరిష్కారం కోసం పనిచేయాలని కోరారు. కొండేటి గోపాల్, కార్తిక్ రెడ్డి, మునిరెడ్డి, ఆనంద రాజ్ గుప్తా, అమర జనార్దన్ రావు, నరసింహ రాజు (నంద), చక్రపాణి, ప్రసాద్ రావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తను విచారించిన టీఎన్ పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాయుడు హత్య కేసులో శ్రీకాళహస్తికి చెందిన జనసేన కార్యకర్త చంద్రశేఖర్‌ను సోమవారం తమిళనాడు పోలీసులు విచారించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద ఉన్న దుకాణంలో న్యాయవాది సమక్షంలో చంద్రశేఖర్ ను విచారించడం జరిగింది. రాయుడు హత్య కేసులో జనసేన మాజీ నియోజకవర్గ ఇంచార్జి వినుత, ఆమె భర్త, మరో ముగ్గురు అనుచరులను నిందితులుగా తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వారంతా కండిషన్ బెయిల్ మీద బయట ఉన్నారు. అయితే ఈ హత్యకూ, తమకు ఎలాంటి సంబంధం లేదనీ, కొందరు మా మీద కుట్ర పన్ని ఇదంతా చేశారంటూ వినుత దంపతులు ఆరోపిస్తున్నారు. అందుకు సంబంధించి కొన్ని వీడియోలు, ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తమిళనాడు పోలీసులు చంద్రశేఖర్‌ను విచారించారు.

ముగిసిన ఏడవ భారతీయ విజ్ఞాన సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం సోమవారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాంబే ఐఐటి ఆచార్యులు కె. సుబ్రహ్మణియన్ మాట్లాడుతూ భావకాలుష్యం, అవినీతి రాహిత్యం, విలువలు పాటించడం అనేవి తోడైనప్పుడే శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో మనం వికసిత భారత్ సాధించగలమన్నారు. విజ్ఞాన భారతి జాతీయ సంఘటన కార్యదర్శి డా. శివకుమార్ శర్మ మాట్లాడుతూ జ్ఞాన విజ్ఞానాల సమన్వయంతో సుస్థిరాభివృద్ధిని సాధించగలమన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా విజ్ఞానభారతి కార్యాక్రమాన్ని అత్యంత దిగ్విజయంగా నిర్వహించడానికి అవకాశం మహద్భాగ్యంగా భావిస్తున్నానన్నారు.

భీమునిచెరువులో వీధిలైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణవనం మండలం జడ్పిటిసి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్ తన సొంత నిధులు 50 వేల రూపాయలతో స్వగ్రామమైన భీమునిచెరువులో వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా విద్యుత్ ఫోల్స్, వైర్లను మార్చడంతో సుమారు 70 స్తభాలకు సంబంధించి విద్యుత్తు లైట్ల పరికరాల కొనుగోలుకు 50 వేలు రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. కశిమిట్ట, మండలం గ్రామాలలో కూడా సంక్రాంతి లోపు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలియజేశామన్నారు.

కరెంటు కష్టాలు తీర్చండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల పరిధిలో నిత్యం జరుగుతున్న విద్యుత్ స్తంభాలు, తీగల మార్పు పనులతో వినియోగదారులు గత రెండు నెలలుగా పగటిపూట కరెంటు లేక ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే గ్రామాల్లో తాగునీటికి నిరంతర విద్యుత్ కొనసాగించడం కోసం పనులు జరుగుతున్నాయని తెలిపారని, ఎప్పటికి ఈ మరమ్మతులు పూర్తవుతాయో తెలుపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రామగిరి, అడవి కండ్రిగ, రెప్పాల పట్టు, వెంకటరెడ్డి కండ్రిగ, తులసి కృష్ణాపురం, లక్ష్మీ విలాసపురం, అద్దాలమేడ, పులియంగుంట, కొత్త గొల్ల కండ్రిగ, పాత గొల్ల కండ్రిగ గ్రామాల్లో సాయంత్రం పొద్దుగూకే వరకు కూడా కరెంటు ఉండడం లేదని తెలపారు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సత్వరం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో వినియోగదారుల నుండి భారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు.

క్విక్ కామర్స్‌లో 3.89 లక్షల ఖర్చు చేసిన తిరుపతి వాసి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నివాసి క్విక్ కామర్స్ కోసం రూ. 3.89 లక్షలు ఖర్చు చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కన్వీనియన్స్–షాపింగ్ కేంద్రాలలో ఒకటిగా తిరుపతి నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతోంది. భారతదేశపు మార్గదర్శక వేదిక అయిన ఇన్‌స్టామార్ట్, హౌ ఇండియా ఇన్‌స్టామార్టెడ్ 2025లో నగరం కేవలం కిరాణా సామాగ్రిని టాప్ అప్ చేయడం మాత్రమే కాదు – ఇది కన్వీనియన్స్ షాపింగ్‌ను పునర్నిర్వచించింది. నగరంలోని అగ్రశ్రేణి కొనుగోలుదారుడు రూ. 3.89 లక్షలు ఖర్చు చేసి, వారి కార్ట్‌ను ప్రోటీన్–ప్యాక్డ్ గ్రీక్ పెరుగు, రుచిలేని వెయ్ ప్రోటీన్, ప్రీమియం ట్రిమ్మర్, గ్రూమింగ్ టూల్స్, పోర్టబుల్ స్టోరేజ్ డ్రైవ్‌లు, అధిక–సామర్థ్యం గల మెమరీ కార్డులు, ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌తో నింపారు. తద్వారా తన కార్ట్ ను ఫిట్‌నెస్, టెక్, రోజువారీ అవసరాల మిశ్రమంగా మార్చారు.

పరశురామేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం, శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వరిడి దర్శనార్థం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ పుల్ల కార్తీక్‌లు కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి, సంఘంలో నూతన ఉత్తేజాన్ని తీసుకురావడానికి కొంత ప్రక్షాళన చేసి జిల్లా, నియోజకవర్గం, మండలం, యువజన విభాగాలలో కొత్తవారికి అవకాశం కల్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లూరి నాగరాజు గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నూతనంగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించారు. నాగరాజు గౌడ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం పోరాటం చేయాలని, అలానే సంఘం బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంభం లోకయ్య, మధు మార్గాచార్యులు, సంఘం నేతలు మునిప్రసాద్, సురేష్ కుమార్, ఎన్.గురవయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్కెట్లో పోటీ, మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు విద్యార్థులు అవగాహన చేసుకోవాలని డాక్టర్ ఏ.దేవికి సూచించారు. పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు పారిశ్రామిక సందర్శన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశ్రామిక సందర్శన కోసం మోడ్రన్ రైస్ మిల్లును సందర్శించారు. పరిశ్రమలో విద్యార్థులు ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి వివిధ రకాల బియ్యాల ప్రాసెసింగ్, మార్కెట్లో జరిగే పంపిణీ, అమ్మకాల గురించి విద్యార్థులు తెలుసుకోవడమే ఈ సందర్శన ఉద్దేశమని దేవకి తెలిపారు. మిల్లు సిబ్బంది ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ వి.వాసవి,, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ కే.శ్రీనివాసులు, జ్యోతి,లక్ష్మి, నాగరాజ తదితర అధ్యాపకులు, కామర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఫ్యాషన్ కళకు తెలిసిన పద్ధతులను అధిగమించి, ఒక కొత్త అమోఘమైన కథను సమర్పిస్తూ నిర్వహించిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఈ సంవత్సరం ఎడిషన్‌ను ముగిసిందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సీఎంఓ దేబాశ్రీ దాస్ గుప్తా తెలిపారు. సోమవారం ఫ్యాషన్ టూర్ ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్డిసిఐ) సహకారంతో, ఈ ప్రదర్శన కళా పనితనం, ఆధునిక టైలరింగ్, మెటాలిక్ జోక్యాలు విశ్వంతో ప్రేరేపించబడిన గ్రాఫిక్స్ ద్వారా పునః కూర్పు చేసిందన్నారు. "ఫ్యాషన్, సాంస్కృతిక సంభాషణలను తీర్చిదిద్దడంలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ ఎల్లప్పుడూ ప్రథమ స్థానంలో ఉంటుందని తెలిపారు.ఎఫ్డిసిఐ చైర్మన్ సునీల్ శేథీ మాట్లాడుతూ భారతదేశపు ఫ్యాషన్‌లో రాబోయే ట్రెండ్ కోసం ఈ టూర్ మార్గం ఏర్పాటు చేసిందన్నారు. ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలు పూడ్చండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బి.ఎన్.కండ్రిగ మండలం, ఎన్‌టీఆర్ నగర్–వరదయ్యపాలెం మండలం సరిహద్దు ప్రాంతంలోని, శ్రీకాళహస్తి–తడ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రమాదకర స్థితికి చేరింది. గత కొన్ని నెలల క్రితం తులాని ప్రాజెక్టు సంస్థ గ్యాస్ పైప్‌లైన్ పనుల కోసం రహదారి పక్కన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి తవ్విన గుంతలను సరిగా పూడ్చకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆ గుంతలు మరింత లోతుగా బురదమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు వెళ్లే సమయంలో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బి.ఎన్.కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలకు చెందిన ప్రజలు నిత్యం శ్రీ సిటీలోని పలు పారిశ్రామిక కంపెనీలకు ఉద్యోగాల నిమిత్తం ఈ రహదారి మీదే రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న రహదారిని మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి సరుకులు వితరణ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో నిత్య అన్నదాన సత్రానికి 35 వేల విలువచేసే నిత్యవసర సరుకులు సోమవారం అందజేసినట్లు ఈవో రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చిన్నగొట్టిగల్లు మండలం, రంగన్నగారిగడ్డకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు తన తండ్రి జ్ఞాపకార్థం నిత్య అన్నదానానికి సరుకులు అందజేసినట్లు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే

ప్రజాశక్తి -కోట : ఎంతో కాలంగా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని తహశీల్దార్ కటారిజయ జయరావు తెలిపారు. కోట మండలం, రుద్రవరం పంచాయతీలో సోమవారం రీ సర్వేపై అవగాహనకు గ్రామ సభ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో తహశీల్దార్ కే.జె జె రావు, డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్ రావు, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ గోపిరెడ్డిలు మాటాడుతూ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సర్వే సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక డీజీపీఎస్(డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషన్ సర్వే) పరికరాలతో భూములు సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. సెంటు భూమి కూడా తేడా లేకుండా సర్వే చేసి ప్రతి సరిహద్దు వద్ద రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రీ సర్వేలో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తహశీల్దార్ ఆధ్వర్యంలో మొబైల్ కమిటీ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ మధుసూదన్ రావు తెలిపారు. సోమవారం సొరకాయల పాల్యం, రెవెన్యూ గ్రామంలోని చల్లా వారి పల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రీ సర్వేలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను గుర్తించి పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రదీప్ నాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్ పురుషోత్తం, వీఆర్ఏ మాధవయ్యలు పాల్గొన్నారు.

పంట పొలాలకు రసాయనలు వాడొద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పంట పొలాలకు విపరీతమైన రసాయనాలు వాడ రాదని రైతులకు అయ్యప్ప నాయుడు సూచించారు సోమవారం తిరుపతి, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల (ఎస్.వి. అగ్రికల్చరల్ కాలేజ్) మూడో సంవత్సరం బి.ఎస్.సి. వ్యవసాయ కళాశాల విద్యార్థులు (100 మంది) సహజ వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకునే ఉద్దేశంతో వేమూరు గ్రామంలో ఉన్న ప్రముఖ సహజ వ్యవసాయ నిపుణుడు, శిక్షకులు అయ్యప్ప నాయుడు సహజ వ్యవసాయ క్షేత్రాన్ని విద్యా సందర్శించారు. ఈ పర్యటనకు కళాశాల సహాయ ఆచార్యురాలు డాక్టర్ కె.నవ్య జ్యోతి విద్యార్థులను తీసుకువెళ్లారు. అయ్యప్ప నాయుడు సహజ వ్యవసాయ ప్రాముఖ్యత, రసాయన రహిత సాగు విధానాలు, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానం, దేశీ ఆవుల వినియోగం, నేల సారాన్ని పెంపొందించే పద్ధతులు, తక్కువ ఖర్చుతో స్థిరమైన దిగుబడులు సాధించే మార్గాలపై విద్యార్థులకు విశదంగా వివరించారు. విద్యార్థులు క్షేత్రంలో అమలు చేస్తున్న వివిధ సహజ సాగు పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించి, అనుభవపూర్వకంగా అవగాహన పొందారు. ఈ కార్యక్రమం ద్వారా సహజ వ్యవసాయం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి మరింత పెరిగిందని డాక్టర్‌నవ్య జ్యోతి పేర్కొన్నారు.

ప్రజామోదం మేరకే మండలాల పునర్విభజన

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి నియోజకవర్గంలో మండలాల పునర్విభజన పూర్తిగా ప్రజల అభిప్రాయాల మేరకే జరిగిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టంచేశారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలో కలపడం ప్రజాభీష్టమేనని తెలిపారు. సోమవారం కలువాయి పర్యటనలో అక్కడ దీక్ష చేపట్టిన టీడీపీ నాయకులకు కొబ్బరినీరు తాగించి దీక్షను విరమింపజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కలువాయి మండలం నెల్లూరు నగరానికి సమీపంగా ఉండటంతో ఆ మండలాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, సీఎంకు లేఖ పంపామని గుర్తుచేశారు. అలాగే రాపూరు, సైదాపురం మండలాల విషయంలోనూ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నెల్లూరు జిల్లాలో విలీనం చేయడం జరిగిందన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలో ఉన్న పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల అధికారిగా వెంకటేశ్వర్లు దుకాణాల్లో స్టాక్ రికార్డులను, అమ్మకాలు, కొనుగోలు రికార్డులను పరిశీలించారు. ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినా, అనధికారిక ఎరువులను అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు అమ్మకాలు కొనుగోలు వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. చిత్తూరు ఏడిఏ వేణుగోపాల్, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మునిరత్నం మృతికి సంతాపం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామానికి చెందిన మద్దలి మునిరత్నం ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఆరణి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, మాజీ సర్పంచ్ గురవయ్య, కిరణ్ యాదవ్, పెనుభాక వెంకటేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు నివాళి మునిరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కోట : గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపిన సందర్భంగా కోట మండల రైతు సంఘం అధ్యక్షులు మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఇచ్చిన హామీ నెరవేర్చాని కొనియాడారు. మండల ప్రజలకు, రైతలకు ఇపుడు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

గూడూరును జిల్లా చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జిల్లా చేయాలని గాంధీ బొమ్మ సెంటర్లో భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టి సోమవారాని 21 రోజులు అయ్యింది. గూడూరు ప్రజలు శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపునాడు కార్యదర్శి కంకణాల పెంచల నాయుడు మాట్లాడుతూ గూడూరును ముక్కలుగాచేసి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు పంచడం సబబుగా లేదన్నారు. గూడూరు ప్రజల చిరకాల కోరాక అయిన జిల్లా కేంద్రంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ మంత్రి గూడూరు ప్రజలకు న్యాయం చేయలేదని ఆరోపించారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బి ఎన్ కండ్రిగ మండలంలోని పలు గ్రామాలలో గత కొన్ని నెలలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేసిన పనికి వేతనం రాలేదని కూలీలు వాపోయారు. వారు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పేరు మారినా తమ బతుకుల్లో మార్పు రాలేదని ఆదేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా తమకు రావాల్సి కూలీలు బకాయిలున్నప్పటికీ అధికారుల పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలు ఆలస్యం కావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, అప్పులు చేసి నిత్యావసరాలు కొనాల్సి వస్తోందని తెలిపారు. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు.

లింగ సమానత్వంతో మహిళా సాధికారత

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ – ప్రోగ్రామ్ ఆఫీసర్, డా.బి. విశాలి ఆధ్వర్యంలో పాతకాల్వ గ్రామంలో వాలంటీర్లు గ్రామ ప్రజలకు సోమవారం నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. వాలంటీర్లు హెల్మెట్ ధరించడం ఆవశ్యకతను ప్రజలకు తెలిపారు. మహిళ అధ్యయన కేంద్రము డా.ఉమాదేవి లింగ సమానత్వం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు చేతపట్టి ర్యాలీగా వెళ్లి మహిళా సాధికారతపై గ్రామస్థుల్లో చైతన్యం కల్పించారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని నెల్లబల్లి గ్రామ సమీపంలోని వాసమ్మ గుడి వద్ద చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాలు మేరకు, శ్రీధర్ మల్లి గ్రామానికి చెందిన దమ్మాయి వంశీ(30), సూళ్లూరుపేట నుండి నాయుడుపేట వైపుకు మోటార్ సైకిల్ పై వెళుతూ.. ముందు వెళుతున్న లారీని ఢీ కొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తిరుపతి హాస్పిటల్ తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

టిప్పర్ ఢీకొని మాహిళ మృతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గరుడ వారధి పై ముందు వెళుతున్న స్కూటర్ను టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథల మేరకు భగత్ సింగ్ కాలనీకి చెందిన శ్యామలమ్మ చుట్టే (53), రూప ఇద్దరు కలసి స్కూటీలో తిరుచానూరు అమ్మవారి దర్శనానికి వెళ్లి తిరిగి కపిలతీర్థం ఆలయానికి వెళుతున్నారు. గరుడ వారధి మీద లక్ష్మీపురం సర్కిల్ వద్ద వెనుక నుంచి వస్తున్న టిప్పరు వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యామల తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడ మృతి చెందింది, రూపాకు గాయాలు కావడంతో స్థానికులు 108 సహాయతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాధికారులు నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే విఐపిల సమాచారాన్ని ట్రస్టు బోర్డు సభ్యులకు చేరవేయడంలో ఆలయాధికారులు నిర్లక్ష్యాన్ని విడాలని టిడిపి బీసీ విభాగం నాయకులు సూచన చేశారు. సోమవారం ఆలయానికి నందమూరి ఆడపడుచు వసుంధర విచ్చేయగా, సమాచారాన్ని ట్రస్ట్ బోర్డు సభ్యులకు, టిడిపి ముఖ్య నేతలకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మండిపడారు. దీంతో నందమూరి అభిమానులు తీవ్రంగా మనోవేదనకు గురయ్యారని వాపోయారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు తీరు మారాలని సూచించారు. లేకుంటే తగిన పర్యావసనాలు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మిన్నల్ రవి, బీమాల భాస్కర్, డా.యం.ఉమేష్ రావు, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల గుంపు హల్ చల్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నాగపట్ల రెవిన్యూ పరిధిలో ఉన్న పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం ఏనుగుల గుంపు గ్రామపరిధిలో ఉన్న పొలాలలోకి దూసుకువచ్చి వరి, అరటి, కొబ్బరి పంటలను ధ్వంసం చేసింది. కొద్ది రోజుల ముందు ఏనుగులు ఇక్కడే తిష్ట వేసి సంచరిస్తూ పంట పొలాలు ధ్వంసం చేస్తూ నాగపట్ల ప్రాంతానికి చేరాయి. అక్కడ ఏనుగుల ఘీంకారాలతో గ్రామస్తులు భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఏనుగులను అడవిలోకి తరలించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కళ్యాణిడాం పీటీసీ, రంగంపేట ప్రాంతాలలో కూడా ఏనుగులు సంచరించే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన రమణ, పద్మ దంపతులు సోమవారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని ఆలయ ఈవో బాపిరెడ్డికి చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.

చిందేపల్లిలో.. సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి -ఏర్పేడు : సామాజిక సమానత్వం, న్యాయం కోసమే సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించినట్లు ఏర్పేడు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిందేపల్లి గిరిజన కాలనీ ప్రజలకు హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మును స్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు::గూడూరు
E.P.No. 14/2022
Chennai O.S.No. 8059/2019
Kavitha ...D.Hr.
Vs.
B.V.Rao ...J.Dr
To
B.V. Rao, S/o.B.A. Swamy, Hindu, aged about 64 Years, Gurivindapudi Village, Manubolu Mandal, SPSR Nellore District - 524405.
పై నెంబరు లో E.P.No.14/2022 లో D.Hr. తన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖల ఆస్తిని వేలం వేయుటకు పిటిషన్ దాఖలా చేసి ఉన్నందున, యిందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 21.01.2026 ఉదయం 10:00 గం॥లకు ఖుద్దుల గానీ, వకీలు ద్వారా గానీ హాజరై కోర్టువారితో మనవీ చేసుకోలసినది లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.
వాయిదా: 21.01.2026
డి. వెంకటేశ్వరరావు
వాది తరపు న్యాయవాది
గూడూరు, సెల్: 9866072082

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు::గూడూరు
E.P.No. 63/2022
(Gajuvaka) O.S.No. 308/2019
అట్ల పద్మ ...D.Hr
వర్సెస్
పుచ్చకట్ల వెంకట వంశీ మల్లిఖార్జున ...J.Dr
పైన తెలిపిన కోర్టు నందు D.Hr తనకు రావసిన డిక్రీ వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంవేసి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుతూ E.P. దాఖలు చేసి యున్నారు. కావున ఈ క్రింది కనబరిచిన E.P. దాఖల షెడ్యూలు ఆస్తిని 11.02.2026 తేదీన పై కోర్టు నందు ఉదయం 10:30 నిమిషాలకు వేలం వేయుదురు. కావున ఆసక్తి గల పాటదారులు ఆ రోజు వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.
E.P. షెడ్యూలు ఆస్తి వివరములు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ గూడూరు మండలం విందూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే నెం. 485 విస్తీర్ణం 1-00 (ఒక ఎకరా) ఎకరా మెట్టభూమి దానికి హద్దులు
తూర్పు: అట్ల రాధయ్య భూమి, **దక్షిణం:** భీమవరం మస్తానమ్మ భూమి, **పడమర:** గోర్తల శ్రీనివాసులు భూమి, **ఉత్తరం:** గోర్తల శ్రీనివాసులు భూమి
D.Hr Value: 26,00,000/-
Amina Value: 27,00,000/-
Upset Price: Rs.5,00,000/-
ఇట్లు
D.Hr తరపున న్యాయవాదులు
కందనూరు వెంకట కృష్ణయ్య,
కందనూరు నితిన్ సాయికృష్ణ
అడ్వకేట్స్ గూడూరు.
సెల్: 9440113977